
సాక్షి ఒడిశా

సోమవారం । 2 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.11,09,576లు, బంగారం 10 గ్రాములు, వెండి 25.5 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



ప్రపంచ కప్‌కు ఘన స్వాగతం

- 8లో.

బీజేడీలో అధికార ప్రతినిధులు

భువనేశ్వర్: బిజూ జనతాదళ్ నాయకులకు కొత్త బాధ్యతలు కేటాయించారు. ఐదుగురిని జాతీయ అధికార ప్రతినిధులుగా, 16 మందిని అధికార ప్రతినిధులుగా నియమించారు. పార్టీ మీడియా కో–ఆర్డినేటర్‌గా లెనిన్ మహంతి నియమితులయ్యారు. మధుస్మితా నాయక్ సంయుక్త మీడియా కో–ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారని బీజేడీ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్‌దాస్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

న్యూస్‌రీల్

రైల్వే బోర్డు చైర్మన్‌గా అనిల్‌కుమార్ లహోటి



భువనేశ్వర్: రైల్వే బోర్డు చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా అనిల్‌కుమార్ లహోటి బాధ్యతలు చేపట్టారు. ఆయన 1984 బ్యాచ్ భారతీయ రైల్వే ఇంజినీరింగ్ సేవా(ఐఆర్‌ఎస్‌ఈ) వర్గం అభ్యర్థి. రైల్వే యాజమాన్యం, నిర్వాహక రంగాల్లో విశేష దక్షత కలిగిన అధికారిగా గుర్తింపు పొందారు.


జగ్నేశ్వర పండాకు సోషల్ ఇంపాక్ట్ అవార్డు



ఇండియా సోషల్ ఇంపాక్ట్ అవార్డుతో జగ్నేశ్వర పండా

జయపురం: సబ్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, జిల్లా జూనియర్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి ప్రముఖ సమాజ సేవకుడు, సాహితీవేత్త జగ్నేశ్వర పండాకు ఇండియా సోషల్ ఇంపాక్ట్ అవార్డు–2022 లభించింది. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖులు, సామాజిక కార్యకర్తల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జ్యూరీ కమిటీ సభ్యులు వాటిని పరిశీలించి, ఉత్తమ సేవలందించిన వారిని ఎంపిక చేశారు. ఇందులో జగ్నేశ్వర పండాను ఎంపిక చేయడం పట్ల జయపురం ప్రజలు, ప్రముఖులు ఆయనను అభినందించారు.

శేఖర్‌బాబు కార్టూన్‌కు అంతర్జాతీయ బహుమతి



అంతర్జాతీయ పోటీల్లో రెండో స్థానంలో నిలిచిన శేఖర్‌బాబు కార్టూన్

రాయగడ: యూరప్ లోని క్రొయేసియా దేశంలో ఇటీవల నిర్వహించిన రెండో అంతర్జాతీయ కార్టూన్ పోటీల్లో జేజేబూం ప్రదర్శనలో గజపతి జిల్లా పర్లాకిమిడికి చెందిన కార్టూనిస్టు ముండూరు శేఖర్‌బాబుకు ద్వితీయ బహుమతి లభించిందని నిర్వాహకులు ఇవాన్ ప్రోమత్‌తో ఈ–మెయిల్ ద్వారా సమాచారం తెలియజేశారు. జనసమూహం అనే అంశంపై శేఖర్ వేసిన కార్టూన్ సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం తదితర మాధ్యమాలకు ప్రజలు ఏ విధంగా బానిసలవుతున్నారో, ఇంటర్నెట్ ట్రాఫిక్ వల్ల వినియోగదారుల అవస్థలను అందులో ఇతివృత్తంగా చిత్రించారు. పోటీలో 49 దేశాల నుంచి 211 కార్టూనిస్టులు పాల్గొనగా, ఆన్‌లైన్ ద్వారా జరిగిన ఓటింగ్‌లో శేఖర్‌కు 122 పాయింట్లు లభించాయి. ఈ నేపథ్యంలో ఆయన కార్టూన్ రెండో స్థానం కైవసం చేసుకోగా, రాష్ట్రం నుంచి ఈ ఘనత సాధించిన ఏకైక వ్యక్తిగా ఉన్నారు. ప్రస్తుతం శేఖర్‌బాబు ఒడిశా కార్టూనిస్టుల అకాడమీ(భువనేశ్వర్)కు కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతున్నారు. అవార్డు లభించడం పట్ల గజపతి ఉత్కళ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ద్విజెన్ పాఢి, బిధాన్ చౌదురి, జాతీయ జర్నలిస్టుల సంఘం(ఎన్‌యూజే) సంఘం అధ్యక్షుడు గరుడధ్వజ చౌదురి, కార్యదర్శి తరిణీ పండా, రాయగడ జిల్లాల జర్నలిస్టుల సంఘం అమూల్యరత్న సాహు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేత టిట్లాఘడ్

జయపురం: సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి కుములి గ్రామంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో టిట్లాఘడ్ జట్టు విజేతగా నిలిచింది. కుములి మూన్‌లైట్ స్టేడియంలో డిసెంబర్ 19న ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్ 31న ముగిసింది. శనివారం మధ్యాహ్నం సుందరఘడ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచిన టిట్లాఘడ్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ధారిత 20 ఓవర్లలో 211 పరుగుల భారీ స్కోర్ చేయగా, అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సుందరఘడ్ 14 ఓవర్లలో కేవలం 133 పరుగులకే కుప్పకూలింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో విజేతలకు జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ముఖ్య అతిథిగా పాల్గొని, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బొరిగుమ్మ జిల్లా పరిషత్ సభ్యుడు పింకు శత్పతి, బొరిగుమ్మ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్ గంతాయత్, సురేంద్ర త్రిపాఠి, ఉపాధ్యాయులు, కుములి లక్ష్మణ బారిక్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి అనీల్ బెహరా తదితరులు పాల్గొన్నారు.



జయపురం: న్యూ ఇయర్ వేడుకల్లో మహిళలు



పర్లాకిమిడి: ఎమ్మెల్యే నారాయణరావుకు శుభాకాంక్షలు చెబుతున్న మున్సిపల్ సిబ్బంది



రాయగడ: నాగావళి హాస్టల్‌లో విద్యార్థుల మధ్య మంత్రి సరక

సందడిగా సంవత్సరాది

- రాష్ట్రవ్యాప్తంగా అంబరాన్నంటిన న్యూ ఇయర్ వేడుకలు
- అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన సంబరాలు
- నృత్యాలతో ఉత్సాహంగా గడిపిన యువత, చిన్నారులు
- ఆలయాల వద్ద బారులుతీరిన భక్తులు



బరంపురం: ప్రత్యేక పూజలందుకుంటున్న మాబుడి శాంతమ్మ



బరంపురం: ఎంపీ చంద్రశేఖర్‌సాహుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న మేయర్ సంఘమిత్ర దొళాయి



జయపురం: ఇంటి ముంగిట తీర్చిదిద్దిన ముగ్గు



బరంపురం: అన్నపూర్ణ మార్కెట్‌లో డైరీలు, గ్రీటింగ్‌ల విక్రయాలు

ఆంగ్ల సంవత్సరాది వేడుకలు ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం నుంచే సంబరాలు ప్రారంభం కాగా.. అర్ధరాత్రి సమయానికి తారాస్థాయికి చేరాయి. యువత డీజే నృత్యాల మధ్య కేక్ కట్ చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అలాగే అధికారులు, ప్రజా ప్రతినిధుల ఇళ్లకు తరలివెళ్లిన సిబ్బంది, అభిమానులు పుష్పగుచ్ఛం అందించి, న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులు గ్రీటింగ్స్ పంచిపెట్టి సందడి చేయగా, మహిళలు ఇళ్లను అందమైన ముగ్గులతో తీర్చిదిద్దారు.

– సాక్షి నెట్‌వర్క్



పర్లాకిమిడి: ప్రౌడ్ చైల్డ్‌కేర్‌లో చిన్నారులకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏడీఎం పండా



జయపురం: అర్ధరాత్రి కేక్ కట్ చేస్తున్న యువతులు



రాయగడ: అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సరక, ఎమ్మెల్యే ముదులి

రాయగడ: రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక రాయగడ ఆటానమస్ కళాశాలకు చెందిన నాగావళి హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మజ్జిగౌరి మందిరంలో ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మకరంద ముదులి, ట్రస్టీ రాయిసింగి బిడ్డిక తదితరులు పాల్గొన్నారు.

బరంపురం: స్థానిక ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా నివాసాలు నూతన సంవత్సర వేడుకలతో సందండిగా మారాయి. బీఎంసీ మేయర్ సంఘమిత్ర దొళాయి సహా, అభిమానులు, ప్రజా ప్రతినిధులు వారికి పుష్పగుచ్ఛా లతో శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే జిల్లా ఎస్పీ సరవన్ వివేక్‌ను పలువురు అధికారులు కలిసి, గ్రీటింగ్స్ తెలిపారు.

బరంపురం నగరంలోని పలు శక్తి పీఠాలతో పాటు వెంకటేశ్వరాలయంలో సత్యనారాయణ ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. మాబుడి శాంతమ్మ ఆలయాన్ని నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు.

జయపురం: పట్టణంలోని నెహ్రూ నగర్‌లో యువత కేరింతల మధ్య నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. మహిళలు నృత్యాలతో రంగులు జల్లుతూ, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ సంబరంగా గడిపారు. అలాగే ఇళ్ల ముంగిట రంగవల్లులు తీర్చిదిద్ది, సుందరంగా అలంకరించారు.

జిల్లా న్యాయ సేవా సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జయపురం కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యనారాయణ మిశ్రా, విజిలెన్స్ జడ్జి రాజేష్ ఎక్కా, జిల్లా అదనపు జడ్జి మహలత్ సాహు, పోక్సో కోర్టు న్యాయమూర్తి సీహెచ్ వాసుదేవ్ పాత్రొ, న్యాయాధికారి దిలీప్‌కుమార్ సాహు, సంస్థ కార్యదర్శి సుమన్ జెనా, సబ్ డివిజనల్ జుడీషియల్ మేజిస్ట్రేట్ సునందా ప్రధాన్, జుడీషియల్ మేజిస్ట్రేట్ గయాధర పాణిగ్రహి, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఆదర్శకుమార్ బెహరా, వివిధ న్యాయాధికారులు మొక్కలు నాటారు.

పర్లాకిమిడి: పట్టణంలోని ఫారెస్ట్ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రౌడ్ చైల్డ్‌కేర్ సంస్థలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సంగ్రాంశేఖర పండా పుష్పగుచ్ఛం, చాక్లెట్లు అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంరక్షణ కేంద్రం అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి, సిబ్బంది పాల్గొన్నారు.

పర్లాకిమిడి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోడూరు నారాయణరావును మున్సిపల్ కార్యాలయం ఇంజినీర్ యుధిష్టర బెహరా, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే పార్టీ జిల్లా సాధారణ కార్యదర్శి ప్రశాంత్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు అరుణిమా సాహు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు జి.శ్రీధరనాయుడు, పి.ఢిల్లీశ్వరరావు తదితరులు ఎమ్మెల్యేను కలిశారు.

పర్లాకిమిడి బీజేడీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ నాయక్‌కు ఛత్రమోర్చా అధ్యక్షుడు బ్రజేష్ త్రిపాఠి, యువజన నాయకులు శాసనం లింగరాజు, వీఎస్ఎన్ రాజు, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సంజుక్తా బెహరా తదితరులు న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.

నవీన్ నివాస్ కిటకిట..



అభిమానులకు ముఖ్యమంత్రి అభివాదం

భువనేశ్వర్: ఆంగ్ల సంవత్సరాది పురస్కరించుకుని ముఖ్యమంత్రి నవీన్ నివాస్ ఆదివారం కిటకిటలాడింది. కరోనా తాకిడితో గత 2 ఏళ్లుగా నవీన్ నివాస్ ముంగిట కొత్త సంవత్సరాది, ముఖ్యమంత్రి జన్మదిన సందడి లేకుండా పోయింది. ఈ ఏడాది సాధారణ ప్రజలకు ఈ అవకాశం కల్పించడంతో అభిమానులు పెద్దసంఖ్యలో అభిమానులు తరలి వచ్చారు. విచ్చేసిన ప్రతి ఒక్కరినీ సీఎం నవీన్ పట్నాయక్ ఆప్యాయంగా పలకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విచ్చేసిన దివ్యాంగుడి చెంతకే వెళ్లిన ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా శుభాకాంక్షలు తెలియజేసి, పుష్పగుచ్ఛం అందుకున్నారు. రాష్ట్ర ప్రజలకు జగన్నాథుని సుఖశాంతులు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.



శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన దివ్యాంగుడికి స్వయంగా వెళ్లి, పలుకరిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్



జయపురం: కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న న్యాయాధికారులు



బరంపురం: జీరో నైట్ ఉత్సవాల్లో సినీతారల సంగీత లహరి

విజిలెన్స్ వేట

- ఏడాదిలో పట్టుబడిన 544మంది అవినీతి అధికారులు
- విజిలెన్స్–2022 నివేదికలో వెల్లడి



భువనేశ్వర్: రాష్ట్ర విజిలెన్స్ విభాగం–2022 వార్షిక నివేదికను శనివారం సాయంత్రం వెల్లడించింది. గత ఏడాది నిర్వహించిన దాడుల్లో 544మంది అవినీతి అధికారులు పట్టుబడ్డారు. వీరికి వ్యతిరేకంగా 285 కేసులు నమోదు చేశారు. ఇందులో 60మంది ప్రథమ శ్రేణి, 53మంది ద్వితీయ శ్రేణి, 227మంది తృతీయ శ్రేణి, నలుగురు నాలుగో తరగతి ఉద్యోగులు ఉన్నారు. అలాగే 159మంది ప్రైవేట్ ఉద్యోగులు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. అవినీతి ఆరోపణల కింద 29శాతం, అక్రమార్జనకు పాల్పడిన వారు 30శాతం, 41శాతం లంచగొండులుగా విశ్లేషించింది. గత ఐదేళ్ల కంటే ఈ ఏడాది అధిక సంఖ్యలో ప్రథమ శ్రేణి ఉద్యోగులు విజిలెన్స్ అధికారులకు చిక్కారు. 4 కేసుల్లో అత్యధికంగా రూ.7 కోట్లను జప్తు చేశారు. నగదు అక్రమ తరలింపులో ఏడుగురు ప్రభుత్వ అధికారులు పట్టుబడ్డారు. వీరి దగ్గర నుంచి రూ.27 లక్షల రూపాయలకు పైగా సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. లంచం తీసుకుంటూ 118మంది చిక్కారు. ఏటా సగటున 200మంది విజిలెన్స్ విభాగం కేసులతో అరెస్ట్ అవుతున్నారు. తాజాగా అరెస్టయిన వారిలో 37మంది ప్రథమ, 39మంది ద్వితీయ, 105మంది తృతీయ శ్రేణి ఉద్యోగులు ఉన్నారు. వీరిలో వివిధ విభాగాలకు చెందిన 47మంది ఇంజినీర్లు, 31మంది రెవెన్యూ అధికారులు, 20మంది పోలీసు అధికారులు, 13మంది అటవీ శాఖ అధికారులు, 12మంది వైద్యులు ఉన్నారని నివేదికలో వివరించారు.

ప్రోటోకాల్ ఉల్లంఘనపై

ఎమ్మెల్యే అసహనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరావు, పక్కన ప్రశాంతకుమార్ పాలో

పర్లాకిమిడి: జిల్లాలో శుక్రవారం నుంచి ప్రారంభమైన ధాన్యం సేకరణ మండీలపై ఎమ్మెల్యే కె.నారాయణరావు స్పందించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా యంత్రాంగం, బీజేడీకి చెందిన నాయకులతో కలిసి మండీలను ప్రారంభించడం సరికాదని, ప్రోటోకాల్ పాటించలేదని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రెండు దఫాలు సమావేశం నిర్వహించి డిసెంబర్ 23న ప్రారంభిస్తామని ప్రకటించినా, బీజేడీ నాయకులతో కలిసి 30వ తేదీన ప్రారంభించడం సరికాదన్నారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యేలకు ఎటువంటి ఆహ్వానం అందలేదని తెలిపారు. ఇక్కడి మండీని సక్రమంగా నిర్వహించక పోవడంతో ఆంధ్రా మిల్లర్లు తక్కువ ధరకే ధాన్యాన్ని తరలించుకు పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయంలో అధికారులు విఫలమయ్యారని, రైతులకు న్యాయం చేసేవిధంగా చొరవ చూపాలని సూచించారు. సమావేశంలో బీజేపీ కృషక్ మోర్చా అధ్యక్షుడు ప్రశాంతకుమార్ పాలో, బరంపురం కేంద్ర కో–ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ పి.ఢిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా తెరవే సాహితీ సమ్మేళనం



కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో 76వ నెలవారీ సాహితీ సమ్మేళనం స్థానిక శాంతినికేతన్ కళాశాలలో ఆదివారం ఘనంగా జరిగింది. సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.వి.రమణమూర్తి, యు.నాగేశ్వరరావుల నిర్వహణలో 16 మంది కవులు తమ కవితలను చదివి వినిపించారు. కార్యక్రమంలో జంధ్యాల శరత్‌బాబు, డాక్టర్ కోమలరావు, తోట గోపాలరావు, ఉపేంద్రశర్మ, ఐఎన్‌డీ ప్రసాద్, ఈ.పాపయ్య, తంగి ఎర్రమ్మ, పి.వి. దుర్గాప్రసాద్, ఎం.రామకృష్ణ, బోగెల ఉమామహేశ్వరరావు, జి.గోపాలకృష్ణ, ఈశ్వరరావు, శ్రీనివాసరావు, కె.వి.రవికిరణ్, పాల్గొన్నారు.

కార్పొరేట్ గవర్నెన్స్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ డి.దుర్గాప్రసన్న రచించిన 'కార్పొరేట్ గవర్నెన్స్ ప్రాక్టీసెస్ ఆఫ్ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్' అనే పుస్తకాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. రచయిత వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో సబ్జెక్టు కాంట్రాక్ట్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. కార్పొరేట్ పరిశ్రమల్లో పాలన విధానం వివరిస్తూ ఈ పుస్తకాన్ని రాశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యుడు డాక్టర్ బుడుమూరు రాజేష్ పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : పట్టణంలోని పీఎన్ కాలనీ సమీపంలో స్కూటీపై వెళ్తున్న మహిళను వెనుక నుంచి కారు వచ్చి ఢీకొనడంతో గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాల మేరకు.. పీఎన్‌కాలనీలో నివాసముంటున్న మెండ జయలలిత (42) ఏడు రోడ్ల కూడలి నుంచి తన స్కూటీపై ఇంటికి వస్తుండగా పీఎన్‌కాలనీ స్టేట్‌బ్యాంకు వద్ద వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో మహిళకు పక్కటెముకల్లో గాయాలవ్వడంతో వెంటనే వైద్యం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నటరాజ నాట్యరత్న పురస్కారానికి హారిక ఎంపిక



హారికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ప్రభాకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలకు చెందిన బీబీఏ విద్యార్థిని శ్రీశైలం హారిక ప్రతిభ కనబర్చింది. ఇటీవలి తిరుమల తిరుపతిలో ఆర్‌కే కళా సాంస్కృతిక ఫౌండేషన్ నిర్వహించిన శాస్త్రీయ నృత్య కార్యాలయంలో అద్భుత నృత్యప్రదర్శనలతో ఆకట్టుకుని నటరాజ నాట్యరత్న పురస్కారం అందుకుంది. నటరాజ నాట్యరత్న-2022 బిరుదును అందుకుని శభాష్ అనిపించింది. ప్రతిభ కనబర్చిన హారికను కళాశాల డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎస్.వి.వేణుగోపాల్, మేనేజ్‌మెంట్ హెచ్‌ఓడీ జె.ప్రభాకరరావు, కళాశాలల చైర్మన్ ఎస్. శేషారెడ్డి, సుగుణారెడ్డి తదితరులు అభినందించారు.

11న సిక్కోలు జానపద కళాజాత



చిన్ననీలావతిలో కళాజాత వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో గ్రామస్తులు

పలాస/కాశీబుగ్గ: పలాస మండలం చిన్ననీలావతి గ్రామంలో ఈ నెల 11వ తేదీన జరిగే సిక్కోలు జానపద కళాజాత నిర్వహించనున్నారు. స్థానిక అమ్మవారి గుడి దగ్గర ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రం, గోడ పత్రిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ నాయుడు సోర్ర వీరస్వామి అభ్యుదయ యువజన సంఘం అధ్యక్షులు గోరకల లోకేశ్వరరావు, సర్పంచ్ సోర్ర తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ కప్‌కు ఘన స్వాగతం

- హాజరైన జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్, యువరాజు చంద్రచూడ్ దేవ్



హాకీ ట్రోఫీకి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బహిణీపతి, యువరాజు చంద్రచూడ్ దేవ్, అధికారులు

జయపురం: రాష్ట్రంలో ఈనెల 13 నుంచి ప్రారంభం కానున్న విశ్వ ప్రపంచకప్‌కు సంబంధించి విజేత జట్టుకు ప్రదానం చేయనున్న ట్రోఫీ శనివారం సాయంత్రం జయపురం చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు, ప్రముఖులు, ఘన స్వాగతం పలికారు. జయపురం సబ్ డివిజన్ అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు, ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్, సబ్ కలెక్టర్ వేదధర ప్రధాన్, తహసీల్దార్ ప్రధాని టులిఅమ్మ, సబ్ డివిజన్ సమాచార, ప్రజా సంబంధాల అధికారి యశోద గదబ, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సరోజ్ దాస్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.గాయత్రీ, ప్రముఖ కళాకారుడు ధీరేన్ మోహణ పట్నాయక్, దేవేంద్ర బాహిణీపతి, జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర్ తండి, కౌన్సిలర్లు హాజరు కాగా.. ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం జయపురం రాజుల కోటలోని ఆరాధ్య దైవం కనకదుర్గ మందిరంలో జయపురం యువరాజు విశ్వేశ్వర చంద్రచూడ్ దేవ్ సమక్షంలో ట్రోఫీకి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ మధ్య ఊరేగించారు. ఆదివాసీ సంప్రదాయ నృత్యాల నడుమ ప్రధానమార్గం వల్లభాయ్ పటేల్ రోడ్డులో ఈ కార్యక్రమం సందడిగా సాగింది. స్వయం సహాయక సంఘాలు, అంగన్‌వాడీ వర్కర్లు, మున్సిపల్ సిబ్బంది, అధికారులు, క్రీడాకారులు, ఎన్‌సీసీ బృందాలు, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు, సిటిజన్ ఫోరం సభ్యులు, సాహిత్య సమితి ప్రతినిధులు, బార్ అసిసోయేషన్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల మధ్య నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పట్టణ పోలీసు అధికారి సమ్మిత్‌కుమార్ బెహరా నేతృత్వంతో పోలీసులు, ఓఎస్‌ఏపీ, మూడో బెటాలియన్ సిబ్బంది ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.



హాకీ ట్రోఫీకి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బహిణీపతి, యువరాజు చంద్రచూడ్ దేవ్

నేడు వైకుంఠ ఏకాదశి

- వైకుంఠ ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

భువనేశ్వర్: పవిత్ర వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజాదులతో ఉత్తర ద్వార దర్శన సౌలభ్యం కల్పిస్తున్నారు. భువనేశ్వర్ లోని తిరుమల తిరుపతి దేవస్థానం వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వేకువజాము నుంచి స్వామివారికి సేవాదులు ప్రారంభించనున్నట్లు ఆలయ సూపరింటెండెంట్ కె.సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. ఉదయం 3 గంటలకు తిరుప్పావై, తోమాల, అర్చన సేవాదులు చేపట్టనున్నారు. అనంతరం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఉత్తర ద్వారం గుండా భక్తులకు నిరవధికంగా సర్వదర్శన సౌలభ్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం కూడా ఈ కార్యక్రమాలతో ఉత్తర ద్వార దర్శన సౌలభ్యం కొనసాగుతుందన్నారు. స్వామివారికి నివేదన పురస్కరించుకుని దర్శనం తాత్కాలికంగా స్తంభింపజేస్తారు.

ప్రత్యేక కార్యక్రమాలు..

వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని దేవస్థానం ప్రాంగణం కల్యాణ మండపం ఆవరణలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ కార్యక్రమాలు నిరవధికంగా కొనసాగుతాయి. విష్ణు సహస్రనామ పారాయణం, సంకీర్తనలు, భజన వంటి కాలక్షేపాలతో కోలాటం, ఒడిస్సీ, మోహినీయాట్టం, వయోలిన్, వాయిద్య కచేరి కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఖుర్దారోడ్ బాలాజీ దేవాలయంలో..

ఖుర్దారోడ్ అకౌంట్స్ కాలనీ బాలాజీ మందిరంలో వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ప్రత్యేక పూజాదులు నిర్వహిస్తున్నారు. వేకువజామున తిరుప్పావై సేవాదులు పూర్తి కావడంతో ఉదయం 4.30 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వారం గుండా సర్వ దర్శనం కల్పిస్తారు. మధ్యాహ్నం లక్ష తులసీ దళార్చన నిర్వహిస్తున్నట్లు బాలాజీ సేవాసమితి నిర్వాహక వర్గం తెలిపింది. ఈ సందర్భంగా విశేష హారతి సేవ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని జాజ్‌పూర్ వైభవ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారికి గరుడ వాహనసేవ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వారం గుండా సర్వదర్శనం ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి సుప్రభాతం, ప్రత్యేక అభిషేకం, సహస్ర నామార్చన, పండ్లతో ప్రత్యేక అలంకరణ, సంధ్యాహారతి, గోవిందనామ సంకీర్తనాలాపన కార్యక్రమాలకు ఏర్పాటు చేస్తున్నారు.



గరుడ వాహనసేవలో శ్రీదేవి, భూదేవి సమేత వైభవ వెంకటేశ్వర స్వామి

మాజీ ప్రజా ప్రతినిధి.. హతవిధీ!



మాజీ ఎమ్మెల్యే పగడాలమ్మకు నిత్యవసరాలు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కాశీబుగ్గ: చుక్క పగడాలమ్మ.. జిల్లా రాజకీయాలపై కాసింత అవగాహన ఉన్న వారందరికీ ఆమె సుపరిచితురాలే. ఒకప్పుడు పాతపట్నం ఎమ్మెల్యేగా సేవలు అందించిన ఆమె.. ఇప్పుడు రోజు గడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. నూతన ఏడాది సందర్భంగా పలాస లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆమె పరిస్థితి తెలుసుకుని పగడాలమ్మ స్వగ్రామం ముక్తాపురం వెళ్లి ఆవిడకు రెండు నెలలకు సరిపడా బియ్యం, ఇతర కిరాణా సరుకులు, కొంత నగదు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ జోనల్ చైర్మన్ లయన్ తుంబాలి సర్వేశ్వరరావు, కార్యదర్శి అట్టాడ మాధవరావు, కోశాధికారి లయన్ వడ్డి రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి క్రీడాకారుల ఎంపిక



ఎంపిక ప్రక్రియకు హాజరైన క్రీడాకారులతో ఎస్‌ఐ సత్యనారాయణ, నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొనే బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక ఎచ్చెర్లలోని ఆర్మ్‌డ్ రిజర్వు పోలీస్ మైదానంలో నిర్వహించారు. ఈ ఎంపిక పోటీలను ఎస్‌ఐ వి.సత్యనారాయణ ప్రారంభించారు. బాల, బాలికల కేటగిరీల్లో ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెలాఖరులో చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జరుగుళ్ల శంకరరావు, డీఎస్‌ఏ ఛీఫ్‌కోచ్ ఎం.మాధురీలత, చీఫ్ రిఫరీ అజయ్‌కుమార్, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షులు మొజ్జాడ వెంకటరమణ పాల్గొన్నారు.

డైరీల కోసం బారులు



దుకాణం వద్ద బారులు తీరిన కొనుగోలుదారులు

భువనేశ్వర్: ప్రభుత్వ డైరీల కొనుగోలు కోసం ప్రజలు బారులు తీరారు. నగరంలోని జయదేవ్ భవన్ ప్రాంగణంలో వీటి విక్రయ కేంద్రం తెరిచారు. డైరీ ఖరీదు రూ.300, కార్డు క్యాలెండర్ రూ.5, షీట్ క్యాలెండర్ రూ.7, మౌంట్ క్యాలెండర్ రూ.40గా నిర్ణయించారు.

ఒక్కరికి డైరీ 1, క్యాలెండర్లు 5, మౌంట్ క్యాలెండర్ 1 మాత్రమే విక్రయిస్తున్నారు. నిత్యం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ప్రాంగణంలో విక్రయాలు నిరవధికంగా కొనసాగుతాయని రాష్ట్ర ప్రజా సంబంధాల విభాగం అధికారులు వెల్లడించారు. కొనుగోలు పరిమితి విధించడంతో ప్రభుత్వ డైరీల అక్రమ విక్రయాలు జరుగుతున్నయనే ఆరోపణలు వ్యాపించాయి.

శ్రీకూర్మనాథాలయంలో ప్రత్యేక ఉత్తర ద్వార దర్శనం



శ్రీకూర్మనాథుడు

గార: ధనుర్మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని శ్రీకూర్మనాథాలయంలో ఉత్తర ద్వార దర్శనం ద్వారా శ్రీకూర్మనాథుడిని దర్శించుకునేందుకు భక్తులకు అవకాశం కల్పించినట్లు ఆలయ ఈఓ జి.గురునాథం, ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు తెలిపారు. సోమవారం వేకువన 3 గంటలకు స్వామికి వివిధ తీర్థ జలాలు, పుష్పాలు, గంధం, వివిధ మూలికలతో ప్రత్యేక అభిషేకాలు జరుగుతాయని, 4.45 గంటలకు ప్రత్యేకంగా గ్రామ మాడవీధుల్లో ఊరేగింపు ఉంటుందని, భక్తులు పాల్గొనాలని కోరారు. దీని కోసం ఆలయాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో పాటు పుష్పాలతో అలంకరించారు.

అరసవల్లిలో..

అరసవల్లి: వైకుంఠ ఏకాదశి (ముక్కోటి ఏకాదశి) సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో ఉత్తర ద్వారా దర్శనాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు శ్వేత అశ్వ వాహనంలో స్వామి ఉత్సవమూర్తులకు తిరువీధి నిర్వహించనున్నారు. అనంతరం సర్వదర్శనాలన్నీ ఉత్తర ద్వారం నుంచే ఉండనున్నాయి. అలాగే అంతరాలయ దర్శనాలు నిలిపివేస్తున్నామని, సోమవారం నాడు ఎలాంటి టిక్కెట్లతో దర్శనాలుండవని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రకటించారు.

సర్పంచ్ ఇంటిపై దాడిపై కేసు నమోదు


పొందూరు: పొందూరు సర్పంచ్ ఆర్.లక్ష్మి ఇంటిపై రాళ్ల దాడి చేసిన సంఘటనలో కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. గత ఏడాది డిసెంబర్ 23న ఇంటిపై రాళ్ల దాడిచేసినట్లు మోహన్, సత్తిబాబు. వెంకటరావు, గోవిందరావు, గణబాబులపై అనుమా నం వ్యక్తం చేస్తూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్థానిక కోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

రేపు డయల్ యువర్ జేసీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యం కొనుగోళ్లలో తలెత్తే సమస్యలు పరిష్కరించేందుకు డయల్ యువర్ జేసీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

బ్యాడ్మింటన్‌లో దూసుకెళ్తున్న.. ఉద్దానం యువ కెరటం

- సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో అద్భుత విజయాలు సాధిస్తున్న శ్రీకర్
- ఒలింపిక్స్ లక్ష్యంగా సాధన



షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న మాదిన శ్రీకర్

కంచిలి: ఉద్దాన ప్రాంతం కంచిలి మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన మాదిన శ్రీకర్ షటిల్ బ్యాడ్మింటన్‌లో దూసుకెళ్తున్నాడు. పాఠశాల స్థాయి నుంచే పలు టోర్నీల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ అంచెలంచెలుగా ఎదుగుతున్నాడు. డిగ్రీ చదువుతున్న శ్రీకర్ ఇప్పటివరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటి శభాష్ అనిపించుకుంటున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణా అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. ఎప్పటికైనా ఒలింపిక్స్‌లో ఆడి తన సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతున్నాడు. కుమారుడి ఆసక్తిని గమనించిన తండ్రి, ఉపాధ్యాయుడు మాదిన చిరంజీవులు చిన్నప్పటి నుంచే ప్రత్యేకంగా ప్రోత్సహించారు. దీంతో టోర్నీల్లో విజయఢంకా మోగిస్తున్నాడు.

విజయ విహారం..

- 2013లో చిత్తూరులో జరిగిన స్టేట్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీలో విన్నర్.
- 2013లో ఇజ్రాయిల్‌లో జరిగిన అండర్-11 విభాగం తరఫున అంతర్జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో రెండు బంగారు, వెండి పతకం కైవసం.
- 2014లో అండర్-13 విభాగంలో కడప, భగల్‌పూర్, రోహతక్, ఉడిపి, తిరుపూర్‌లలో జరిగిన పోటీల్లో సింగిల్స్‌లో స్టేట్ విన్నర్.
- 2015లో కర్నూల్ జిల్లా నంద్యాలలో జరిగిన స్కూల్ చాంపియన్‌షిప్ పోటీల్లో అండర్-13 విభాగంలో రన్నర్.
- 2015లో కర్నూల్ జిల్లా ఎమ్మిగనూరులో స్టేట్ ఓపెన్ మీట్‌లో విన్నర్.
- 2015 అక్టోబర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో 15 ఏళ్ల విభాగంలో డబుల్స్‌లో ప్రథమస్థానం.
- 2017లో ఖేలో ఇండియా పోటీల్లో డబుల్స్‌లో రన్నరప్.
- 2017లో స్టేట్(ఎ.బి.ఎల్.) ఆంధ్రా బ్యాడ్మింటన్ లీగ్‌లో వైజాగ్ సినర్జీస్ టీం తరఫున రన్నర్.
- 2018లో ఏబీఎల్‌లో ప్రకాశం బుల్స్ ఒంగోలు తరఫున రన్నర్
- 2019 నుంచి 2022 మే వరకు కోవిడ్ కారణంగా టోర్నమెంట్స్ లేకపోవడంతో ప్రాతినిధ్యం వహించలేదు. ఈ ఏడాది అక్టోబర్‌లో నంద్యాలలో జరిగిన పోటీల్లో సీనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి రన్నర్‌గా నిలిచాడు.

గజ్జె ఘల్లుమన్నదో..

- జాతీయ యువజనోత్సవాలకు మోనాలీ దాస్ ఎంపిక
- ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల్లో ప్రదర్శనలు, ప్రశంసలు
- టీవీ చానెల్స్‌లో భక్తి పాటల ద్వారా గుర్తింపు



యువజనోత్సవాల్లో నృత్య ప్రదర్శనలిస్తున్న మోనాలీదాస్

ఇచ్ఛాపురం రూరల్: సిక్కోలు మణిపూస మోనాలీ దాస్ సరికొత్త మైలురాళ్లు వేసుకుంటూ వెళ్తోంది. జిల్లా తరఫున ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొన్న మోనాలీ దాస్ ప్రథమ బహుమతిని పొంది జాతీయ స్థాయి యువజనోత్సవాలకు ఎంపికైంది. ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి ప్రాథమికోన్నత పాఠశాలలో ఒడియా అధ్యాపకురాలు మనోజ్ మంజిరీ త్రిపాఠీ కుమార్తె మోనాలీదాస్. తండ్రి లక్ష్మణదాస్ బెర్హాంపూర్‌లో ఒడియా ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. తమ కుమార్తెకు నృత్యంపై ఉన్న ఆసక్తిని గమనించిన తండ్రి లక్ష్మణదాస్ ఇచ్ఛాపురంలో వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీలో తానే గురువుగా నృత్యంలో శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం బెర్హాంపూర్ శిశు విద్యామందిర్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూనే మరోవైపు వివిధ ప్రాంతాల్లో నిర్వహించే నృత్యపోటీలు, సెలవుల సమయాల్లో ఒడిశా టీవీ చానెల్స్‌లో ప్రసారమయ్యే ఆధ్యాత్మిక భక్తి పాటలకు నృత్యం చేస్తూ ఇరు రాష్ట్రాల్లో పలు ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు అందుకొని పలు అవార్డులను అందుకుంది.

అవలీలగా 16 నృత్యాలు

సాధారణంగా నృత్యకారులు ఒకే రంగంలో తమ పాండిత్యాన్ని ప్రదర్శిస్తారు. కానీ మోనాలీదాస్ మాత్రం కూచిపూడి నృత్యంతో పాటు భరతనాట్యం, ఒడిస్సీ నృత్యాల్ని నేర్చుకుంది. ముఖ్యంగా కూచిపూడి నృత్యంలో భామాకలాపం, తరంగం, శివతాండవం, బ్రహ్మాంజలి, అన్నమాచార్య కీర్తనం, భరత నాట్యంలో శివరంజని, అలరిపు, జ్యోతిషరం, తిల్లాన, స్వరజ్యోతి, శబ్దం, వర్ణం, ఒడిస్సీ నృత్యంలో పల్లవి, స్థాయీ, అభినయ, మంగళచరణ్ నృత్యాల్లో ప్రత్యేక శిక్షణ పొందింది.

బిజీబిజీ

తెలుగు, ఒడియా, ఇంగ్లిష్, హిందీ భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన మోనాలీదాస్ కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ నృత్యాలతో పాటు ఒడియా, హిందీ భాషల్లో ప్రముఖ ఆధ్యాత్మిక టీవీ చానెల్స్ ప్రార్థన, తరంగ, మంజిరీ ఛానెల్స్‌లో ఇప్పటికి 88 ఆధ్యాత్మిక భక్తి పాటలకు నృత్యాభినయం చేసింది. అలాగే ఆంధ్రా, ఒడిశా, భువనేశ్వర్, లక్నో ప్రాంతాల్లో వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు.

జాతీయ స్థాయిలో విజేతగా నిలవాలి



ఇప్పటికే రెండు సార్లు జాతీయ స్థాయిలో జరిగిన నృత్య పోటీల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. ఈ సారి ముచ్చటగా మూడోసారి యువజనోత్సవాల్లో శ్రీకాకుళం జిల్లా తరఫున పాల్గొంటున్నాను. జాతీయ స్థాయిలో ఒడిస్సీ నృత్య పోటీల్లో విజేతగా నిలవడమే నా లక్ష్యం. నృత్యంతో పాటు చదువులో కూడా తగ్గేదే లేదు. ఇంటర్ చదువుతూనే నీట్‌కు ప్రిపేరవుతున్నాను.

– మోనాలీదాస్, ఒడిస్సీ నృత్యకారిణి

ధనరాజులమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



బారులు తీరిన భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజులమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. నూతన సంవత్సరం సందర్భంగా వేకువజాము నుంచే వందలాది మంది భక్తులు ఒడిశా రాష్ట్రం బరంపురం, ఛత్రపురం, జయంతిపురం, పాత్రపురం ప్రాంతాల నుంచి, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి మండలాల నుంచి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సండే సందడి



నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో కవిటి సమీపంలోని పుక్కళ్లపాలెం సముద్రతీరం ఆదివారం సందర్శకుల తాకిడితో కిటకిటలాడింది. గత మూడేళ్లు కరోనా ప్రభావంతో పెద్దగా సందర్శకులకు అనుమతి లేకపోవడం, తాజాగా ఆంక్షల్లో వెసులుబాటు ఉన్న నేపథ్యంలో తీరం జనసంద్రాన్ని తలపించింది. పెద్ద సంఖ్యలో ఫాస్ట్‌ఫుడ్, టీస్టాల్, స్నాక్స్‌స్టాల్స్ ఏర్పాటుకావడంతో జనాలు సందడి చేశారు. – కవిటి

క్లుప్తంగా

కలెక్టర్‌కు ‘బిజినెస్ బొకే’

- వినూత్న గ్రీటింగ్ అందజేసిన లీడ్ బ్యాంక్ అధికారులు



బిజినెస్ బొకేను అందుకుంటున్న కలెక్టర్ సూర్యకుమారి



బిజినెస్ బొకే

విజయనగరం అర్బన్: జిల్లా బ్యాంకింగ్ వ్యవహారాలు పర్యవేక్షించే లీడ్ బ్యాంక్ అధికారులు ‘బిజినెస్ బొకే’ పేరుతో వినూత్న గ్రీటింగ్‌ను కలెక్టర్ ఎ.సూర్యకుమారికి ఆదివారం అందజేశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి అధిక వ్యయం వెచ్చించి ఎలాంటి బొకేలతో రావద్దని కలెక్టర్ కోరిన నేపథ్యంలో శాఖా పరమైన లక్ష్యాల నివేదికను ‘బిజినెస్ బొకే’గా కలెక్టర్‌కు అందజేశామని లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎ.శ్రీనివాసరావు తెలియజేశారు. జిల్లాలోని బ్యాంక్‌లు 2023లో సాధించాల్సిన లక్ష్యాలను గ్రీటింగ్ బొకేలో పొందుపరిచామని తెలిపారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

మెరకముడిదాం: మండలంలోని గర్భాం గ్రామ సమీపంలో జొన్నపంటలో నిర్వహిస్తున్న పేకాటశిబిరంపై బుదరాయవలస ఎస్సై సీహెచ్ నవీన్‌పడాల్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం పోలీసులు దాడి చేసి 8 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారి దగ్గర రూ.11,500 స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన వారిని సోమవారం రిమాండ్‌కు తరలిస్తామని ఎస్సై నవీన్‌పడాల్ తెలిపారు.

పట్టాలపై అడ్డంగా రాళ్లు



గేటుకు అడ్డంగా ఆగిన గూడ్స్ రైలుతో నిలిచి పోయిన ప్రయాణికులు

గజపతినగరం: ఆకతాయి విద్యార్థులు రైలు పట్టాలపై రాళ్లు పెట్టడంతో మండలంలోని పురిటి పెంట రైల్వే గేటు వద్ద బొబ్బిలి నుంచి విశాఖపట్నం వెళ్తున్న గూడ్స్ ట్రైన్ ఆదివారం సాయంత్రం నిలిచి పోయింది. దీంతో ఆ రైల్వే గేటు గుండా ప్రయాణం చేసే వారంతా కాసేపు అవస్థలు పడ్డారు. రైల్వే గేట్‌మన్ మురళి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 5వతరగతి, 6వ తరగతి చదువుతున్న ముగ్గురు ఆకతాయి విద్యార్థులు రైలు పట్టాలపై రాళ్లు పెట్టడంచూసిన ట్రైన్ డ్రైవర్ బండిని ఒక్కసారిగా నిలిపివేశాడు. దీంతో ఆ గేటు గుండా వెళ్లే ప్రయాణికులు కాసుపు ఇబ్బంది పడ్డారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు ఆదివారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, అర్చకులు తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు తదితరులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరించుకుని భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. నూతనంగా కొనుగోలు చేసిన వాహనాలకు పూజలు చేయించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ కిశోర్‌కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు పూలే స్ఫూర్తి

బొబ్బిలి: దేశంలో బాలికలు చదువుకునేందుకు సావిత్రిభాయి పూలేను స్ఫూర్తిగా తీసుకోవా లని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి అన్నారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో సావిత్రిభాయి పూలే జయంత్యుత్సవాలను ఆదివారం నిర్వహించా రు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి యూటీఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశంలో బాలికలు చదువుకునేందుకు స్ఫూర్తిగా సావిత్రిభాయి పూలే నిలిచారన్నారు. ఆమె ఆశయ సాధనకు అందరూ పాటు పడాలని, అందుకు బాలికలను చదివించేలా సమాజంలో చైతన్యం తేవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికీ కొన్ని చోట్ల బాలికల పట్ల వివక్ష కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివక్షను రూపుమాపేందుకు అంతా కృషి చేయాల ని పిలుపునిచ్చారు. సంఘ నాయకులు ప్రసన్నకుమార్,బి రమేష్, కే కృష్ణదాసు పాల్గొన్నారు.

తల్లీపిల్లల క్షేమం కోసం..!

- ఆస్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్యసిబ్బంది నియామకం
- 24 గంటల పాటు మాతాశిశువులకు అందనున్న వైద్యసేవలు
- ఇకపై ఘోషా ఆస్పత్రిలో హైరిస్క్ కేసులు



బొబ్బిలి సామాజిక ఆస్పత్రి

విజయనగరం ఫోర్ట్: వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో మాతాశిశువులకు నిరంతరం వైద్య సేవలు అందించేందుకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు వైద్య విధాన్ పరిషత్ పరిధిలోని ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆస్పత్రు(సీహెచ్‌సీ)ల్లో మాతాశిశువులకు వైద్యసేవలు అందించడానికి అవసరమైన (ఎనస్థీషియా, పిడియాట్రిక్, గైనికాలజి)వైద్యులను నియమించింది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో పూర్తిస్థాయిలో వైద్యులు లేక పోవడం వల్ల మాతాశిశువులకు అంతంతమాత్రంగానే వైద్యసేవలు అందేవి. గైనకాలజిస్టు, పిడియాట్రిక్, ఎనస్థీషియా వైద్యుల పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ అయ్యేవి కావు. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయా ఆస్పత్రుల్లో అవసరమైన మేరకు పూర్తిస్థాయిలో వైద్య బృందాన్ని నియమించింది. అదేవిధంగా పారామెడికల్ వైద్య సిబ్బందిని కూడా నియమించింది. దీంతో ఇకపై మాతాశిశువులకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందనున్నాయి.

జిల్లాలో 8 ఆస్పత్రులు

వైద్యవిధాన్ పరిషత్ పరిధిలో జిల్లాలో 8 ఆస్పత్రులు ఉన్నాయి. అవి ఎస్.కోట, గజపతినగరం, రాజాంలలో ఏరియా ఆస్పత్రులు, బొబ్బిలి, నెల్లిమర్ల, భోగాపురం, బాడంగి, చీపురుపల్లిలో సామాజిక ఆస్పత్రులు ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో గర్భిణులకు సాధారణ ప్రసవాలు, సిజేరియన్లు చేసేందుకు గైనకాలజిస్టులు, మత్తు వైద్యులను నియమించారు. అదేవిధంగా పుట్టే పిల్లలకు అవసరమైన చికిత్స అందించేందుకు పిల్లల వైద్యులను ఇటీవల చేపట్టిన నియామకాల్లో శాశ్వత ప్రాతిపదికన నియమించారు. అలాగే సాధారణ వైద్య సేవలు అందించడానికి అవసరమైన జనరల్ ఫిజీషియన్లను కూడా నియమించారు. సీహెచ్‌సీల్లో ఎవరైనా సెలవు పెడితే వైద్య సేవలకు ఇబ్బంది కలగకుండా సమీపంలో ఉన్న ఆస్పత్రి నుంచి వైద్యులను ఏర్పాటుచేస్తారు.

ఘోషా ఆస్పత్రిపై తగ్గిన ఒత్తిడి

సాధారణ ప్రసవాలు, సిజేరియన్లు సైతం చాలా వరకు ఏరియా ఆస్పత్రి, సీహెచ్‌సీల నుంచి ఘోషాఆస్పత్రికి రిఫరల్‌గా వస్తున్నాయి. దీంతో ఘోషా ఆస్పత్రిపై ఒత్తిడి పెరుగుతోంది. సాధారణ ప్రసవాలు, సిజేరియన్లు వైద్య విదాన్ పరిషత్ ఆస్పత్రుల్లో జరిగేలా చేయడం కోసం ప్రభుత్వం మాతాశిశు వైద్యబృందాన్ని అందుబాటులో ఉంచింది. దీని వల్ల ఘోషాఆస్పత్రిపై ఒత్తిడి తగ్గుతుంది. కేవలం హైరిస్క్ కేసులకు మాత్రమే ఘోషా ఆస్పత్రిలో చికిత్స అందించడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో వైద్యులను, సిబ్బందిని నియమించడంతో 24 గంటల పాటు వైద్యసేవలు అందనున్నాయి.



డాక్టర్ బి.గౌరీశంకర్, డీసీహెచ్‌ఎస్

నేటి నుంచి సమ్మేటివ్ పరీక్షలు

- హాజరుకానున్న 18,969 మంది విద్యార్థులు



సమ్మేటివ్-1 పరీక్ష పత్రాలను సిద్ధం చేస్తున్న నెల్లిమర్ల ఎంఈఓ కార్యాలయ సిబ్బంది

విజయనగరం పూల్‌బాగ్: సమ్మేటివ్-1 పరీక్షలు జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు 18,969 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలయ్యే వారి సంఖ్య తగ్గించడం, మంచి గ్రేడ్ పాయింట్లు సాధించే వారి సంఖ్య పెంచడమే సమ్మేటివ్ పరీక్షల ఉద్దేశం. స్వీయ మూల్యాకనం పేరిట జిల్లాలోని 27 మండలాల్లో తొలిసారిగా ఈ ప్రణాళికను ప్రభుత్వ పరిధిలోని జెడ్పీ, కేజీబీవీ, ఆదర్శ, గురుకుల పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. పరీక్ష సమయానికి సమ్మేటివ్ సిలబస్ పూర్తిచేసి, పునశ్చరణ చేసేలా చర్యలు తీసుకున్నారు. సిలబస్‌ను నాలుగు విభాగాలుగా విభజించి, ప్రతి సబ్జెక్టుకు నాలుగు పరీక్షలు నిర్వహిస్తారు. డీసీఈబీ ద్వారా ప్రశ్నపత్రం అందిస్తున్నారు. పాఠశాలల్లో ముందురోజు చదివించి, మరుసటి రోజు సబ్జెక్టులపై పరీక్ష పెడతారు. అదే రోజు మూల్యాంకనం చేసి సమాధాన పత్రాన్ని తల్లిదండ్రులకు పంపించి వారి సంతకం పెట్టి తీసుకురావాలని విద్యార్థులకు సూచిస్తున్నారు. దీనిపై ప్రతి వారం ప్రధానోపాధ్యాయులు సమీక్షిస్తుండగా, డిప్యూటీ డీఈఓలు పర్యవేక్షిస్తున్నారు.ఇందులో వెనుకబడిన వారిని గుర్తించి, తదుపరి ప్రణాళిక తయారు చేస్తారు.ఈ పరీక్షలు ఈ నెల పదోతేదీవరకు జరుగుతాయి.1-5 తరగతులకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30వరకు, 6,7,8 తరగతులకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు, 7,9 తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.

పూర్తయిన ఏర్పాట్లు



జిల్లా వ్యాప్తంగా సమ్మేటివ్-1 పరీక్షలకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. 27 మండలాల్లో 18,969మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలయ్యే వారి సంఖ్య తగ్గించడం, మంచి గ్రేడ్ పాయింట్లు సాధించే వారి సంఖ్య పెంచడమే దీని ఉద్దేశం.

– బి. లింగేశ్వరరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి, విజయనగరం.

ఆగిపోయిన ‘కూత’

- కబడ్డీ ఆటలో క్రీడాకారుడి మృతి



రమణ మృతదేహం

పూసపాటిరేగ: కబడ్డీ ఆటలో ప్రమాదవశాత్తు అదుపుతప్పి యువకుడు నేలపై పడడంతో మెడకు తీవ్రగాయాలై చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. డిసెంబరు 31 వతేదీ రాత్రి మండలంలోని వెంపడాం గ్రామంలో కబడ్డీ క్రీడాపోటీలు జరిగాయి. కొవ్వాడ-ఎరుకొండ జట్ల మధ్య కబడ్డీ క్రీడ హోరాహోరీగా సాగుతోంది. ఈ నేపథ్యంలో కొవ్వాడ గ్రామానికి చెందిన యువకుడు కూతకు వెళ్లాడు. కూతకు వచ్చిన వ్యక్తిని పట్టుకునే క్రమంలో ఎరుకొండకు చెందిన క్రీడాకారుడు అల్లి రమణ (18) అదుపుతప్పి నేలపై పడడంతో మెడ విరిగింది. చికిత్స నిమిత్తం విజయనగరం తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడినుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్సపొందుతూ 1వతేదీ ఉదయిం మృతిచెందాడు. అనుకోని ప్రమాదంలో కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు శ్రీనివాసురావు, భూలక్ష్మి భోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈమేరకు పూసపాటిరేగ ఎస్సై ఎ.నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



వాసు (ఫైల్)

బొబ్బిలి: నూతన సంవత్సర వేడుకలు ఓ యువకుడిని బలి తీసుకుని ఆ కుటుంబానికి తీవ్ర విషాదం నింపాయి. పట్టణంలోని గొల్లపల్లికి చెందిన గలగట్ల వాసు మరో ఇద్దరు యువకులు ఆదివారం తెల్లవారు జామున పెట్రోల్ కోసం బైక్‌పై వెళ్తుండగా కారును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వాసు అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలి

- ఎస్పీ ఎం.దీపిక



ఎస్పీకి శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీస్ సంక్షేమ పాఠశాల ఉపాధ్యాయులు

విజయనగరం క్రైమ్: నూతన సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఎస్పీ ఎం.దీపిక ఆకాంక్షించారు. జిల్లా పోలీసు క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పోలీస్ అధికారులు, ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆమెను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ ఏడాది అందరికీ మంచి జరగాలని, పోలీసుశాఖ నిర్దేశించుకున్న లక్ష్యాలకు చేరుకునే విధంగా సమర్థవంతంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, ప్రజలందరికీ మంచి సేవలందిస్తూ పోలీసుశాఖ ప్రతిష్ట పెంచే విధంగా పనిచేయాలని కోరారు. జిల్లా ప్రజలందరూ సుభిక్షంగా, సంతోషంగా, క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. శాంతియుత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, శాంతి భద్రతల సమస్యలు లేకుండా జీవించేలా పోలీసులు చేపట్టే చర్యలకు జిల్లా ప్రజలు కూడా సహకారం అందించాలని కోరారు. అంతేకాకుండా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు బాధ్యత కలిగిన పౌరుడిలా ప్రతి ఒక్కరూ వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సాల్మన్, విజయనగరం ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, బొబ్బిలి డీఎస్పీ బి.మోహనరావు, దిశ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, డీపీఓ ఏఓ వెంకటరమణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీ ఎం.దీపికకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బ్రహ్మకుమారీస్



నూతన సంవత్సర డైరీని ఎస్పీకి అందజేస్తున్న పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబు

క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రణాళికా శాఖ ఉద్యోగుల వితరణ



ప్రణాళిక శాఖ సమకూర్చిన సొమ్మును అందుకుంటున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: జిల్లాలోని క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహారం అందజేసే నిమిత్తం తమ వంతు సాయం చేసేందుకు జిల్లా ప్రణాళికా విభాగం అధికారులు, ఉద్యోగులు ముందుకు వచ్చారు. ఈ మేరకు ప్రణాళిక శాఖలోని ఉప గణాంక అధికారులు, సహాయ గణాంక అధికారులు, కార్యాలయంలో పనిచేసే అధికారులంతా కలిసి రూ.25 వేలను వారి సహాయం కోసం సమకూర్చారు. ఈ మొత్తాన్ని జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి పి.బాలాజీ నేతృత్వంలో కలెక్టర్ ఎ.సూర్యకుమారికి నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందజేశారు. ఈ మొత్తాన్ని అందజేసిన ఉద్యోగులను కలెక్టర్ అభినందించారు. ప్రణాళిక శాఖ ఉద్యోగులు ఇతర శాఖల సిబ్బందికి స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు.

ప్రైవేట్ లేఅవుట్‌లకు దీటుగా...

- జగనన్న కాలనీల అభివృద్ధి
- రూ.439.75కోట్లతో పనులు
- పూర్తయిన విద్యుత్ సౌకర్యం
- చురుగ్గా తాగునీటి సదుపాయం, రోడ్ల నిర్మాణం

విజయనగరం గంటస్తంభం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్న జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రైవేట్ లే అవుట్‌లకు దీటుగా వివిధ సౌకర్యాల కల్పన జరుగుతోంది. ఇందుకోసం ప్రభుత్వం కేటాయించిన నిధులు అధికారులు ఖర్చు చేస్తున్నారు. ఫలితంగా కాలనీల్లో నివాసం ఉండేందుకు సౌకర్యాల కల్పన జరగడంతో ఇళ్ల నిర్మాణ పనులు కూడా లబ్ధిదారులు చురుగ్గా చేపడుతున్నారు.

అన్ని సదుపాయాలకు నిధుల మంజూరు

జిల్లాలో 652 జగనన్న లే అవుట్‌లు ఉన్నాయి. వాటిలో భూమి చదును మొదలుకుని తాగునీరు, విద్యుత్, రోడ్లు తదితర సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం రూ.9.75కోట్లు మంజూరు చేసింది. ఇందులో తొలివిడత భూమి చదునుకు రూ.1.39కోట్లు కేటాయించగా రెండో విడత రూ.74లక్షలు మంజూరు చేసింది. అప్రోచ్ రోడ్లకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖకు రూ.2.94కోట్లు, మున్సిపల్‌శాఖకు రూ.1.37కోట్లు విడుదల చేసింది. లబ్ధిదారుల సిమెంట్ కోసం గోదాములు నిర్మించగా విద్యుత్ లైన్ల మార్పు కోసం రూ.72.65లక్షలు, లే అవుట్‌ల్లో అంతర్గత రోడ్లకు రూ.44.70లక్షలు, కల్వర్టులు, వంతెనలకు రూ.45.90లక్షలు, లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు నీటి సరఫరాకు రూ.46.45లక్షలు, బ్రిక్ యూనిట్‌కు విద్యుత్ సౌకర్యానికి రూ.68.45లక్షలు, సోలార్ విద్యుత్‌కు రూ.2.64లక్షలు కేటాయించగా ఆ పనులన్నీ పూర్తయ్యాయి.

మౌలిక సదుపాయాలకు రూ.కోట్లలో ఖర్చు

ఇదిలా ఉండగా 652 కాలనీలకు విద్యుత్, తాగు నీరు, రోడ్ల కోసం కూడా భారీగా నిధులు కేటాయింపు జరిగింది. విద్యుత్ సదుపాయానికి రూ.300కోట్లు కేటాయించారు. ఇందులో ఇప్పటికే 651 లే అవుట్‌లకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఇందుకోసం రూ.100కోట్లు ఖర్చు చేశారు. తాగునీటి సౌకర్యం కోసం మొత్తం అన్ని లేఅవుట్‌ల్లో కేంద్ర ప్రభుత్వ పథకమైన జలజీవన్ మిషన్‌లో రక్షిత మంచినీటి పథకాల నిర్మాణం చేయాలని నిర్ణయించారు. అయితే ఇళ్ల ప్రారంభోత్సవం కార్యక్రమం నిమిత్తం 111 కాలనీల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకు రూ.130కోట్లు కేటాయించారు. ఇదిలాఉండగా మిగతా కాలనీలకు బోర్ల ద్వారా నీరందించే ఏర్పాటు చేస్తున్నారు. అంతర్గత రోడ్లకు సంబంధించి అంచనాలు తయారవుతున్నాయి. ఇందుకోసం వేలాది కోట్లు ఖర్చు పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

అన్ని పనులు జరుగుతున్నాయి

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పన చురుగ్గా జరుగుతోంది. ఇళ్ల నిర్మాణం కోసం తాగునీరు, ఇతర సదుపాయాలు కల్పించాం. విద్యుత్ సౌకర్యం పూర్తయింది. శాశ్వత తాగునీటి సరఫరా కోసం పనులు జరుగుతున్నాయి. రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేసరికి అన్ని సదుపాయాలు కల్పిస్తాం.

ఎస్.వి.రమణమూర్తి, పీడీ, గృహనిర్మాణ సంస్థ

గిరి ప్రదక్షిణకు వేళాయె..

- నేడు రామతీర్థం పుణ్యక్షేత్రంలో గిరి ప్రదక్షిణ
- ఉదయం 5 గంటల నుంచి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనాలు
- ఏకాదశి సందర్భంగా 11 గంటలకు స్వామివారి కల్యాణం
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం అధికారులు

పవిత్ర పర్వదినం ముక్కోటి ఏకాదశి సందర్భంగా రామతీర్థం పుణ్యక్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి. ఉత్తర ద్వార దర్శనం కోసం తరలివచ్చే భక్తజనం కోసం అన్ని ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సదుపాయం, అన్న సంతర్పణ, వైద్య శిబిరం తదితరమైనవి ఏర్పాటు చేశారు.





రామతీర్థం ఉత్తర ద్వారం (ఇన్‌సెట్లో) సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలు

నెల్లిమర్ల: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో సోమవారం (నేడు) పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వేకువజామున 5 గంటల నుంచి 7.30 గంటల వరకు ఆలయంలో భక్తులకు ఉత్తరద్వార దర్శనాలు కల్పిస్తారు. 7.30 గంటలకు సీతారామలక్ష్మణుల ఉత్సవ మూర్తులను రామతీర్థం తిరువీధుల్లో మేళతాళాలతో ఊరేగిస్తారు. 8 గంటలకు నీలాచలం వద్ద మెట్లోత్సవం, గోపూజ కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం గిరి ప్రదక్షిణ కార్యక్రమం జరుగుతుంది. 11 గంటలకు ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహిస్తారు.

7.30 గంటల వరకు ఉత్తరద్వార దర్శనాలు

ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా రామతీర్థం ఆలయంలో భక్తులకు ఉత్తరద్వార దర్శనాలు వేకువజామున 5 గంటల నుంచి అవకాశం కల్పిస్తారు. సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను ఉత్తర ద్వారంలో వేంచేపుచేసి, అర్చకులు ప్రత్యేక పూజలు జరిపిస్తారు. సాధారణ భక్తులను సైతం 7.30 గంటల వరకు దర్శనాలకు అనుమతిస్తారు. ఉత్తర ద్వారంలోనే భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తారు. అనంతరం లోక కల్యాణార్థం ఉత్సవ మూర్తులను రామతీర్థం తిరువీధుల్లో మేళతాళాలతో ఊరేగిస్తారు.

8 గంటలకు మెట్లోత్సవం, గోపూజ

ఏటా నిర్వహించినట్లుగానే రామతీర్థంలో ఈ ఏడాది కూడా ఉదయం 8గంటలకు మెట్లోత్సవం, గోపూజ కార్యక్రమాలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. నీలాచలం(బోడికొండ)పైకి ఎక్కే మెట్లను నీటితో శుభ్రం చేస్తారు. ప్రతి మెట్టుకు పసుపు రాసి, కుంకుమ బొట్లు పెడతారు. కొబ్బరికాయలు కొట్టి, అరటిపండ్లు నైవేద్యంగా పెట్టి, ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. అలాగే ఆలయ అర్చకులు గోవులకు ప్రత్యేకంగా పూజలు జరిపిస్తారు. ఈ కార్యక్రమాలను నిర్వహించడానికి భక్తులకు అవకాశం కల్పిస్తారు.

2015 నుంచి గిరి ప్రదక్షిణ

రామతీర్థం పుణ్యక్షేత్రంలో ప్రతి ఏటా ముక్కోటి ఏకాదశి పర్వదినాన నిర్వహించినట్లుగానే ఈ ఏడాది కూడా గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక్కడ 2015వ సంవత్సరంలో గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. మొదటి రెండేళ్లు కార్తీక పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ చేశారు. 2017 నుంచి ముక్కోటి ఏకాదశి పర్వదినాన చేపడుతున్నారు. అదే సంవత్సరంలో శ్రీరామతీర్థం సేవా సంఘం ఆధ్వర్యంలో నీలాచలం చుట్టూ మట్టి రహదారిని నిర్మించారు. అప్పటి నుంచి గిరి ప్రదక్షిణకు అనుకూలంగా మారింది. సోమవారం ఉదయం 8.30 గంటలకు గిరి ప్రదక్షిణ మొదలవుతుందని సంబంధిత అధికారులు తెలిపారు.

11 గంటలకు సీతారాముల కల్యాణం

ఉదయం 11 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించనున్నారు. ఆలయంలోని లక్ష్మీదేవి సన్నిధిలో అర్చకులు కల్యాణం జరిపిస్తారు. భక్తులందరినీ కల్యాణంలో పాల్గొనడానికి అవకాశం కల్పిస్తామని అధికారులు తెలిపారు. భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారంలో దర్శనం చేసుకుని, మోక్షం పొందాలని, అలాగే మెట్లోత్సవం, గోపూజ, గిరి ప్రదక్షిణ, సీతారాముల కల్యాణం కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ప్రత్యేక కార్యక్రమాలతో పాటు సాధారణ దర్శనాలు కూడా ఉంటాయని తెలిపారు.